క్లుప్తంగా

శ్రీనివాస్ మృతి తీరని లోటు

గోపాలపట్నం: పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరని లోటు అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సోడదాసి సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీనివాస్ మృతిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేశారు. పార్టీకి ప్రజలకు ఎనలేని సేవలందించారన్నారు. శ్రీనివాస్‌కు నివాళులర్పిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని ప్రార్థిస్తున్నానని సుధాకర్ తెలిపారు.

ఫుట్‌పాత్ వ్యాపారులకు గొడుగుల పంపిణీ



బాజి జంక్షన్‌లో కూరగాయల వ్యాపారికి గొడుగు అందిస్తున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం: గోపాలపట్నం జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేస్తున్న వారికి శనివారం గొడుగులు పంపిణీ చేశారు. గోపాలపట్నం చంద్రనగర్, బాజి జంక్షన్, ఎన్‌ఏడీ ప్రాంతాల్లో చిరు వ్యాపారులు, చెప్పులు కుట్టే వారికి భారీ గొడుగులు అందించారు. వర్షా కాలం మొదలైన నేపథ్యంలో వ్యాపారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు వీటిని అందించామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జేడీ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

తిరుపతికి కుర్తాళం పీఠాధిపతి పయనం



తిరుపతికి పయనమైన సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో గురువుల ఆరాధనోత్సవాలు శుక్రవారంతో ముగియడంతో శనివారం ఉదయం కుర్తాళం పీఠాధిపతి జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని తిరుపతికి పయనమయ్యారు. అక్కడ నుంచి వారణాశికి తరలివెళ్లి సిద్ధేశ్వరి పీఠంలో కొద్ది రోజుల పాటు స్వామీజీ వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఆషాఢ మాసం సందర్భంగా జూలై 6 నుంచి వారాహి నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను పక్కాగా గుర్తించాలి

మహారాణిపేట : కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మొదటి విడతగా 73 కేసులను గుర్తించామన్నారు. కుష్టు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందిని వినియోగించుకుని కచ్చితమైన కేసులను గుర్తించాలన్నారు. జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు కుష్టువ్యాధిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు.

ఉద్యోగ విరమణ సత్కారం



ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను ఊరేగిస్తున్న కార్మికులు

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ స్టీల్ కాంప్లెక్స్ అడిషనల్ జనరల్ మేనేజర్ సిమాచల్ దాస్, షిప్‌యార్డ్ సొసైటీ మాజీ జనరల్ సెక్రటరీ బీవీఈ సత్యనారాయణ శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా తోటి కార్మికులు ఘనంగా సత్కరించారు. కార్మికులు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన సిమాచల్‌దాస్ ఎందరో ఉద్యోగుల ఉన్నతికి పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

శుభకార్యాలకు ఇబ్బందులు

- కల్యాణ మండపం నిర్వహణపై మల్కాపురం వాసుల ఆగ్రహం
- జీవీఎంసీ అధికారుల తీరుపై విస్మయం
- రూ.వేలకు వేలు దోచేస్తున్న నిర్వాహకులు



మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపం

మల్కాపురం: గ్రామకంఠం స్థలంలో స్థానికుల కోసమే కల్యాణ మండపం నిర్మించామన్నారు. తక్కువ ఖర్చుతో ఘనంగా శుభకార్యాలు చేసుకోండని నమ్మించారు. నేడు ఆ కల్యాణ మండపాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి శుభకార్యాల కోసం వెళ్లే గ్రామస్తుల వద్ద వేలకు వేల రూపాయలు గుంజుతున్నారు. జీవీఎంసీ అధికారుల నిర్వాకమే ఈ దుస్థితికి కారణమని మల్కాపురం వాసులు మండిపడుతున్నారు.

గ్రామస్తులకు ఉపయోగపడేలా నిర్మాణం..

61వ వార్డు మల్కాపురంలో సుమారు 16 సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు కొన్నేళ్ల నుంచి నివసిస్తున్నారు. ఇక్కడ గ్రామం ఏర్పడినప్పుడు మల్కాపురం మరిడిమాంబ ఆలయం వద్ద, మల్కాపురం మార్కెట్ వద్ద, ప్రకాష్‌నగర్ ఏడు గుడుల సెంటర్ వద్ద గల సుమారు 15 ఎకరాల స్థలాన్ని నాడు మునసబులు గ్రామ అభివృద్ధి, గ్రామంలోని అమ్మవార్ల ఆలయాల నిర్వహణ కోసం కేటాయించారు. కాలక్రమేణా ప్రకాష్‌నగర్ ఏడు గుడుల సెంటర్ వద్ద గల 10 ఎకరాల స్థలం ఆక్రమణకు గురైంది. మల్కాపురం మరిడిమాంబ ఆలయం వద్ద గల సుమారు రెండెకరాల స్థలం ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు గ్రామ పెద్దలు కంకణం కట్టారు. ఈ స్థలంలో గ్రామస్తులకు ఉపయోగపడేలా ఏదైనా నిర్మించాలని అనుకున్నారు. గ్రామ పెద్దల వద్ద నిర్మాణానికి అవసరమైన ధనం లేకపోవడంతో దానిని మరిడిమాంబ పండగ, పరస నిర్వహణలకు ఉపయోగించే వారు.

ఇలా నమ్మించారు..

ఈ స్థలంపై 13 ఏళ్ల కిందట జీవీఎంసీ అధికారుల కన్ను పడింది. ఈ ప్రదేశంలో పారిశ్రామిక ప్రాంతంలో ఎక్కడా లేని విధంగా కల్యాణ మండపం నిర్వహిస్తామని, గ్రామస్తులంతా జీవీఎంసీ సూచించే అతి తక్కువ ధరకే శుభకార్యాలు చేసుకోవచ్చని నమ్మించారు.

దీంతో గ్రామస్తులు ముందుకొచ్చి ఆ స్థలాని కల్యాణ మండపం కోసం ఇచ్చారు. అన్న మాట ప్రకారం పారిశ్రామిక ప్రాంతంలోనే అతి పెద్ద కల్యాణ మండపాన్ని అధికారులు నిర్మించారు. తొలి రోజుల్లో నామమాత్రం రుసుముకే అద్దెకు ఇచ్చే వారు. గ్రామస్తులతోపాటు బయట వారు కూడా ఈ కల్యాణ మండపంలో వివిధ శుభకార్యాలు చేసుకునే వారు. ఇప్పుడు దీనిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారు(ఒప్పంద కాంట్రాక్ట్). గ్రామస్తులు ఎవరైనా శుభకార్యాలు చేసుకునేందుకు కాంట్రాక్టర్ వద్దకు వెళ్తే రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. దీంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్కువ అద్దెకు ఇస్తామని చెప్పి నేడు కాంట్రాక్టర్ ద్వారా వేలకు వేల రూపాయలు గుంజడమేంటని ప్రశ్నిస్తున్నారు. అధిక మొత్తంలో అద్దె చెల్లించే స్తోమత లేదని వాపోతున్నారు. పూర్వం మాదిరిగా ఈ కల్యాణ మండపాన్ని జీవీఎంసీ వారే నిర్వహించాలని, లేకుంటే గ్రామ పెద్దలకు అప్పగించాలని కోరుతున్నారు.

శుభకార్యాలు చేసుకోలేని పరిస్థితి



మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపంలో శుభకార్యాలు చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. కల్యాణ మండపం కావాలంటే రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇలాగైతే పేదలు ఇక్కడ శుభకార్యాలు చేసుకోలేరు. అధికారులు ఆలోచించి పేదలు, గ్రామస్తులకు న్యాయం జరిగేలా చూడాలి.

– శీర చిన్నాజీ యాదవ్, మల్కాపురం

గాజువాక వెళ్లాల్సి వస్తోంది



నా సోదరుడి వివాహం కోసం మరిడిమాంబ కల్యాణ మండపాన్ని బుక్ చేద్దామని వెళ్తే.. కాంట్రాక్టర్ రూ.40 వేలు అద్దె అడిగాడు. చేసేది లేక గాజువాకలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో వివాహం జరిపించాం. మా గ్రామకంఠం స్థలంలో కల్యాణ మండపం నిర్మించి, తమకే ఇంత అద్దె అంటే ఎలా చెల్లించగలం.

– బాలు, స్థానికుడు

నేత్రపర్వం.. అప్పన్న నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు కనులపండువగా జరిగాయి. అందులో భాగంగా ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలు, అక్షింతలను అందజేశారు.

ఘనంగా సహస్ర నామార్చన

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శనివారం సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. ఉత్సవ మూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి, 1001నామాలను పఠిస్తూ స్వామి వారికి అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి తులసి ప్రసాదం అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



రమణితో మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళ నాయకురాలు భర్త ఇటీవల మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ ఆ కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, గులిగిందల లావణ్య, పి.వి.సురేష్, బల్లా లక్ష్మణరావు, నాయకులు కాకి శ్యామ్‌కుమార్, పూండి మల్లేశ్వరరావు, దొడ్డి సతీష్, బుజ్జి, పత్నిరావు, కేబుల్ వాసు తదితరులు పరామర్శించిన వారిలో పాల్గొన్నారు.

దంతేవాడ-కమ్లూర్ సెక్షన్‌లో పనులు పూర్తి

- సెక్షన్‌లో రైల్వే సేఫ్టీ కమిషనర్ తనిఖీలు
- పరీక్షలు, స్పీడ్ ట్రయల్ విజయవంతం



దంతేవాడ-కమ్లూర్ సెక్షన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే సేఫ్టీ కమిషనర్ సువోమోయ్ మిత్ర



మోటార్ ట్రాలీపై పరీక్షలు చేస్తున్న అధికారులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో కీలకంగా ఉన్న డబ్లింగ్ లైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పూర్తయిన పనులను ఉన్నతాధికారులు వెంటవెంటనే తనిఖీలు కూడా చేస్తున్నారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మించిన దంతేవాడ- కమ్లూర్ డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి. ఈ మార్గంలో శనివారం రైల్వే సేఫ్టీ(ఈస్టర్న్ సర్కిల్) కమిషనర్ సువోమోయ్ మిత్ర, డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పరీక్షించారు. అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో ఈ తనిఖీలు చేపట్టారు. దంతేవాడ-కమ్లూర్ స్టేషన్ల మధ్య మోటార్ ట్రాలీలపై ట్రాక్ అసెస్‌మెంట్స్, రైల్వే స్టేషన్స్, నూతన సిగ్నలింగ్ వ్యవస్థ, దంతేవాడ వద్ద డంకిని నదిపై నూతనంగా నిర్మించిన బ్రిడ్జిలను పరిశీలించారు.

రవాణా మరింత వేగవంతం

స్పీడ్ ట్రయల్ కూడా విజయవంతంగా పూర్తయినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. సవాళ్లు, ప్రతికూల పరిస్థితుల్లో ఈ రెండో లైన్‌ను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ డబ్లింగ్ లైన్ వల్ల చత్తీస్‌ఘడ్-ఆంధ్రప్రదేశ్ మధ్య రవాణా మరింత వేగవంతం కానుంది. బైలడిల్ల నుంచి విశాఖపట్నం పోర్ట్‌లకు ఇనుప ఖనిజం రవాణా మరింత వేగంగా, ఎక్కువగా సాగనుంది. పర్యటనలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(కన్‌స్ట్రక్షన్) ఎస్.శ్రీనివాస్, ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) సుధీర్ కుమార్ గుప్తా, చీఫ్ ఇంజినీర్(కన్‌స్ట్రక్షన్) డి.శ్రీనివాసరావు, ఇతర డివిజనల్ ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

మై భారత్ పోర్టల్ ఎంతో ఉపయోగకరం



సదస్సుకు వచ్చిన అతిథులు

మల్కాపురం : యువతలో ఆచరణాత్మక నాయకత్వానికి,సాంకేతిక పరిజ్ఞానానికి మై భారత్ పోర్టల్ ఎంతగానో ఉపయోగపడుతుందని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి అన్నారు.మల్కాపురం సెయింట్ మహిళ కళాశాల వద్ద యువజన సదస్సు శనివారం జరిగింది. సదస్సులో పాల్గొన్న ఆమె ఈ నెల 24వ తేదీన గీతం కళాశాలలో మై భారత్ పోర్టల్ పై సీనియర్ ప్రోగ్రాం అధికారి అనసూయదేవితో కలిసి ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యానన్నారు. శిక్షణలో తాము నేర్చుకున్న అంశాలు నేటి యువతకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయన్నారు. యోగ, స్వచ్ఛ భారత్, పర్యావరణ పరిరక్షణ మొదలగు విషయాలు మై భారత్ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల నుంచి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజీమార్గమే ఉత్తమం



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయమూర్తి షణ్ముఖరావు

గాజువాక : కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకోవడానికి రాజీమార్గాన్ని అనుసరించడం ఎంతో ఉత్తమమని 13వ అదనపు జిల్లా జడ్జి షణ్ముఖరావు అన్నారు. గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో జాతీయ లోక్ అదాలత్ శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంతాలకు పోయి కోర్టుల చుట్టూ తిరగడం వల్ల సమయంతో పాటు ఆర్థికంగా కూడా చాలా ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు తలెత్తుతాయన్నారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల ఈ ఇబ్బంది తగ్గుతుందని, కక్షిదారుల మధ్య మంచి సంబంధాలు ఉంటాయని అన్నారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడానికి వచ్చిన కక్షిదారులను ఈ సందర్భంగా అభినందించారు.

5 బెంచీల్లో 178 కేసుల పరిష్కారం

కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించిన లోక్ అదాలత్ శిబిరంలో కక్షిదారుల మధ్య రాజీ కుదర్చడం ద్వారా న్యాయమూర్తులు 178 కేసులను పరిష్కరించారు. 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.షణ్ముఖరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, మోటార్, యాక్సిడెంట్, బీమా తదితర రూ.5.42 కోట్ల విలువైన కేసులను పరిష్కరించినట్టు కోర్టువర్గాలు తెలిపాయి. ఈ శిబిరంలో న్యాయమూర్తులు ఐదు బెంచీలను ఏర్పాటు చేశారు.

విద్యార్థుల చదువు.. భవితకు వెలుగు



మధురానగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు

సీతంపేట: విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దేది ప్రభుత్వ పాఠశాలలే అని ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాస్, మండల విద్యా శాఖ అధికారులు డి.రామారావు, బాలామణి అన్నారు. 25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల పరిసర ప్రాంతాల్లో శనివారం 'నేను బడికి పోతా' ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యా శాఖ ఏఎస్‌వో గీత, ఏపీవో అప్పలనాయుడు, హెచ్ఎం బి.దేముడుబాబు, ఉపాధ్యాయ సిబ్బంది అందరూ కలిసి ర్యాలీ చేశారు. మధురానగర్, శాంతిపురం, రాజేంద్రనగర్, సీతంపేట ప్రాంతాల్లో జరిగిన ర్యాలీలో బడి బయట ఉన్న నలుగురు విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సదుపాయాలు, అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం, ఆరోగ్య పరీక్షలు, స్టూడెంట్ కిట్, ఇంగ్లిష్ మీడియం బోధన, ఇతర విద్యా ప్రమాణాలను వివరించి బడిలో చేర్పించాలని కోరారు. కో ఆర్డినేటర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు అందరూ తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో చేరాలని, వారి బంగారు భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని బడికి పంపించాలని కోరారు.

సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు జయప్రదం చేయాలి



సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

సింధియా : జూలై 1,2,3 తేదీల్లో మురళీనగర్‌లోని బీవీఆర్ గ్రాండ్ హాల్‌లో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలను జయప్రదం చేయాలని పశ్చిమ నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సింధియా కూడలిలో పోస్టర్ ఆవిష్కరించారు. అచ్చినాయుడుతోటలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని, కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేయాలని, రోడ్లు, డ్రైనేజీలను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ సీపీఐ సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు, నాయకులు నూనెల రాంబాబు, గెండ అప్పారావు, గోపి, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలని వినతి



ఈఎస్ఐ సూపరింటిండెంట్‌కు వినతి పత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

సింధియా: పారిశ్రామిక ప్రాంత కార్మిక వర్గానికి ఈఎస్ఐ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందించాలని విశాఖ ఇండస్ట్రీయల్ ఏరియా కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ జనరల్ సెక్రటరీ దేవర అప్పలరాజు ఆస్పత్రి సూపరింటిండెంట్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దేవర అప్పలరాజు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులు వైద్య సేవలు పొందడానికి రూ.21వేలు వేతనం పేరిట పరిమితి విధించడం అన్యాయమన్నారు. అటువంటి నిబంధనలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో ఇతర యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు అండగా కళంజియా



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న మహిళ సంఘాలు

మల్కాపురం : మహిళలు శక్తివంతులు కావాలని, స్వయం ఉపాధి ద్వారా పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ధాన్ ఫౌండేషన్ రీజినల్ కో ఆర్డినేటర్ కె.రామ్‌కుమార్ అన్నారు. మల్కాపురం కళంజియా సంస్థ ఆధ్వర్యంలో మల్కాపురం మరడిమాంబ కళ్యాణమండపం వద్ద కళంజియా సమాఖ్య సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక పరిధి 7 వార్డుల్లో సుమారు 440 పొదుపు సంఘాలు ఉన్నాయని, సుమారు 6 వేల మంది కుటుంబాలతో కళంజియా పనిచేస్తోందని వివరించారు. పొదుపు సంఘ సభ్యులు రూ.18 కోట్ల వరకు పొదుపు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు ఆదిలక్ష్మి, ఫెడరేషన్ కో ఆర్డినేటర్ సుభాషిణి పాల్గొన్నారు.

50 లక్షల మొక్కలు నాటి పెంచండి



ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ విజయకుమార్

సీతమ్మధార: విశాఖలో 50 లక్షల మొక్కలు నాటి, వాటిని పెంచి, 5 వేల టన్నుల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేద్దామని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పిలుపునిచ్చారు. సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో శనివారం ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ విజయకుమార్‌కు గ్రీన్‌క్లైమేట్ టీం ఔషధ మొక్కలు, పువ్వుల మొక్కలను అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన బంతులతో విశాఖను హరిత వనం చేద్దామన్నారు. ప్రిన్సిపాల్ విజయకుమార్ మాట్లాడుతూ భూగోళం మీద సమస్త జీవరాశిని కాపాడాల్సిన బాధ్యత మానవాళిదేనన్నారు. ప్రకృతి ఆధారిత పంటల ఆహారాన్నే ఆరగించాలని సూచించారు. జీవీఎంసీ ఎస్ఆర్‌యూ ప్రతినిధి అక్షత మాట్లాడుతూ విశాఖలో అమలవుతున్న ఎకో వైజాగ్‌లో భాగంగా మొక్కలు నాటి, పెంచే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. స్కూల్ ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఎస్ఆర్‌యూ ప్రతినిధులు ప్రమీల, వివేక్, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ టీచింగ్ ఫ్యాకల్టీ శివలక్ష్మి, జోషఫ్ నవీనా, బి.జ్యోతి, ఫర్జానా బేగం పాల్గొన్నారు.

6 అడుగుల నాగజెర్రి పట్టివేత



నాగజెర్రిపామును పట్టుకున్న స్నేక్‌క్యాచర్ సురేష్

పెదగంట్యాడ: నెల్లిముక్కులోని ఎంపీపీ పాఠశాల వద్ద 6 అడుగుల నాగజెర్రిని స్నేక్ సేవర్ సొసైటీ ప్రతినిధి శనివారం సాయంత్రం పట్టుకున్నారు. వివరాలివి.. పాఠశాలలోని బాత్రూంలోకి దూరిన నాగజెర్రి, తర్వాత బయటికి రావడంతో, అక్కడున్న విద్యార్థులు గమనించి, భయంతో గట్టిగా కేకలు వేశారు. అక్కడే ఉన్న ఎంఈవో రమణాజీ వెంటనే స్నేక్ సేవర్ సొసైటీకి సమాచారం ఇచ్చారు. వెంటనే సొసైటీ ప్రతినిధి సురేష్ అక్కడికి చేరుకుని, దానిని చాకచక్యంగా పట్టుకున్నారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఎక్కడైనా పాము కనిపిస్తే దానికి ఎలాంటి ప్రమాదం తలపెట్టకుండా వెంటనే స్నేక్ సేవర్ సొసైటీకి 88663 68899 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.